క్లుప్తంగా

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: నేషనల్ హెల్త్ మిషన్‌లో గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న సీహెచ్‌ఓ(ఎంఎల్‌హెచ్‌పీ) చేపట్టిన సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మద్దతు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరం సందర్శించి మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పి లు వేతన పెంపు, హెచ్‌ఆర్ పాలసీ, ఇన్సెంటీవ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాలలో వారి విధులు వారు నిర్వర్తించకుండా అదనపు పనిభారాలను వారిపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సెంటర్లలో కాకుండా ఆయా ప్రాంతాలలోని ఆస్పత్రులలో వారికి మధ్యాహ్నం వరకు వివిధ రకాల పనులను అప్పగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వలనే వారి సమ్మె అనివార్యమైందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎంఎల్‌హెచ్‌పిల సంఘాల ప్రతినిధులందరితో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'రక్తకన్నీరు' నాగభూషణం పుస్తకావిష్కరణ



నగరంపాలెం: నాటక రంగం నుంచి మహానటుడిగా నాగభూషణం రాణించారని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకుడు లంక సూర్యనారాయణరావు పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయంలో సోమవారం రక్త కన్నీరు నాగభూషణంపై తీసుకొచ్చిన పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా లంక సూర్యనారాయణరావు మాట్లాడుతూ నాగభూషణం కళలకు, కళాకారులు, సమాజానికి చేసిన సేవ నిస్వార్థమైందన్నారు. సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్య మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు రంగస్థలంపై నాగభూషణం రక్తకన్నీరు నాటకం వెలిగిందన్నారు. జీఎస్టీ సూపరింటెండెంట్ మిక్కిలినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నాగభూషణం నటనలో ఉన్నత ప్రమాణాలు పాటించారన్నారు. జర్నలిస్టు ఉదయగిరి ఫయాజ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. గ్రంథాలయ పాలకురాలు సుహాసిని పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, కలరింగ్, తెలుగు పద్యాలు, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి.సత్యశిరీష పర్యవేక్షణలో విద్యార్థులకు ఆయా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

● ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో భారతదేశం- భూ భాగాలు, రాష్ట్రాలు-రాజధానులు గురించి, కథలపై వీవీ కృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

జిల్లా కోర్టు ఉద్యోగి ఆత్మహత్య

లక్ష్మీపురం: అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న జిల్లా కోర్టులో ఉద్యోగి అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనగర్ 3వ లైన్ ప్రాంతానికి చెందిన సురేంద్ర(48) జిల్లా కోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో మానసికంగా బాధపడుతున్నాడు. దీంతో తట్టుకోలేక అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు కుమారుడు శివ మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ప్రత్తిపాడు: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ప్రత్తిపాడు ఎఫ్‌సీసీ యూత్ ఆధ్వర్యంలో మార్చి 31వ తేదీ నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బలసాని కిరణ్‌కుమార్ తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం బ్యాట్ చేతపట్టి మైదానంలో క్రికెట్ ఆడారు. విజేతలకు బహుమతులను అందజేశారు. బలసాని మాట్లాడతూ.. నేటి యువతకు క్రికెట్ ఒక ఫ్యాషన్ అని తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సోమవారం టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో పెదనందిపాడు, ప్రత్తిపాడు జట్లు హోరాహోరీగా తలబడ్డాయి. పెదనందిపాడు జట్టుపై ప్రత్తిపాడు జట్టు 43 పరుగుల తేడాతో జయభేరీ మోగించింది.

సమస్యల కూత



- స్టేషన్ అంతటికి ఒక ప్లాట్‌ఫారంపైనే మరుగుదొడ్లు
- రెండు ప్లాట్‌ఫారాలపైనే రైళ్ల రాకపోకలకు పరిమితం
- అలంకారప్రాయంగా మినరల్ వాటర్ ప్లాంట్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రమే..
- ఇది గుంటూరు రైల్వే స్టేషన్ దుస్థితి

లక్ష్మీపురం: దేశంలో ఈ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రభుత్వం మోడల్ స్టేషన్‌గానూ గుర్తించింది. ప్రయాణికులు, సరకు రవాణా ఆదాయంలో అగ్రగామిగా ప్రసిద్ధి. ఏపీలో రాజధాని అమరావతికి ప్రధాన స్టేషన్ ఇదే. పలువురు ప్రముఖులు ఈ స్టేషన్ నుంచే ప్రయాణం చేస్తుంటారు. అయినా వసతుల కల్పనల అధమంగా ఉన్నాయి. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో

ఇది డివిజన్‌లో అతి పెద్ద రైల్వే స్టేషన్. మొత్తం 8 ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. ప్రతి రోజు సుమారు 31 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, అనేక ప్యాసింజర్ రైళ్లు ప్రయాణిస్తాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వెళ్లే రైళ్లు సుమారు వందకు పైగా ప్రయాణిస్తుంటాయి. ప్రతి రోజు రైల్వే డివిజన్ పరిధిలో సుమారు 95 వేల మంది ప్రయాణిస్తుంటారు.



ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై వినియోగంలో ఉన్న మరుగుదొడ్లు

మరుగుదొడ్లు లేక అవస్థలు


రైల్వే స్టేషన్‌లో మొత్తంలో ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపైనే మరుగుదొడ్లు పనిచేస్తున్నాయి. ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే మిగిలిన ప్లాట్‌ఫారంపై ఉండే ప్రయాణికులు, మరి ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు 1వ ప్లాట్‌ఫారంకు రావల్సిందే. ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసిన ప్రీ పెయిడ్ రెస్ట్ రూమ్‌లను వినియోగించేందుకు రైల్వే అధికారులు మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు. అలాగే దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి అయితే ఎప్పుడు తాళాలు వేసే ఉంటుంది. దాని పక్కనే ఉన్న మహిళల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంత గది తలుపులు ఎప్పుడు మూసే ఉంటాయి.

వసతులు అంతంతమాత్రమే..

కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. వేసవి ఎండ తీవ్రత మరో వైపు రైల్వే ప్రయాణికులకు కనీసం కూర్చునేందుకు సరిపడే విధంగా బెంచ్‌లు లేక పోవడంతో ప్లాట్‌ఫారం నెల పైనే కూర్చోవాల్సి వస్తుంది. డివిజన్ అధికారులు ఏర్పాటు చేసిన తాగునీటి మినరల్ వాటర్ హబ్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అలంకార ప్రాయంగా మారింది.

కొన్ని ప్లాట్‌ఫారాలకే రైళ్లు..

సాంకేతికంగా అభివృద్ధి స్టేషన్‌లో ఏమాత్రం కనిపించడం లేదు. రెండు ప్లాట్‌ఫారాలకు మాత్రమే రైళ్లు వచ్చే విధంగా కేటాయిస్తున్నారు. 1,4 వ ప్లాట్‌ఫారాలు కీలకంగా ఉన్నాయి. రెండో నంబర్ ప్లాట్‌ఫారం అయితే రైలు నంబర్ 22876 గుంటూరు-విశాఖ డబల్ డెక్కర్ రైలు పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. పెద్ద రైల్వే స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫారాలపై రైళ్లరాక పోకలు జరిగేలా డివిజన్ అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రయాణికులు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో అలంకారప్రాయంగా ఉన్న మినరల్ వాటర్ కేంద్రం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, పక్కన మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు తీసుకున్నారు. ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తరువాత చేయగలిగినవి వేరు వేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని కోరారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని మేయర్, కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామని చెప్పారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలని సూచించారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 33 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 20, ఇంజినీరింగ్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 1 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతంచ ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

డ్రెయిన్‌లలో మెష్‌లు ఏర్పాటు చేయాలి

నెహ్రూనగర్: నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్రతి డ్రెయిన్ మేజర్ డ్రెయిన్ కలిసే కల్వర్టు ప్రాంతంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు రాకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన డ్రెయిన్లలో వ్యర్థాలు నిలిచి వర్షాకాలంలో తీవ్ర సమస్యగా మారుతుందని, అంతర్గత డ్రెయిన్ల నుంచి వ్యర్థాలు నేరుగా మేజర్, అవుట్ ఫాల్ డ్రెయిన్‌లోకి రాకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గార్బేజ్ వలనరబుల్ పాయింట్స్ వద్ద గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేయాలని, మ్యాట్‌లు ఉన్న ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాష, సూపరింటెండెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పిన్ పాయింట్ ప్రకారం పనులు చేపట్టాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు ఇళ్ల నుంచి నూరు శాతం చెత్త సేకరణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ బ్రాడీపేట, అశోక్ నగర్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఏసీపీ రెహ్మాన్, బయాలజిస్ట్ రామారావు ఉన్నారు.

గ్రంథాలయాలకు పుస్తకాలు అందజేత



గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరావుకు పుస్తకాలు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంతో పాటు అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు రిఫరెన్స్ పుస్తకాలను అందజేశారు. ప్రాంతీయ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ చైర్మన్ గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగుల కోసం డీఎస్సీ, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, కానిస్టేబుల్స్, ఎన్‌టీపీసీ, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారికోసం రూ.30 వేల విలువైన పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గతంలో లైబ్రరీలో పనిచేసిన పూర్వ గ్రంథాలయాధికారిణి అక్కినేని అచ్చమాంబ, డెప్యూటీ డైరెక్టర్ సీహెచ్ దీక్షితులు, గ్రంథాలయ సొసైటీ అధ్యక్షుడు జి.శివప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథ పాలకురాలు కె.రూన్సీరాణి, ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు నరసింహారావు, జ్యోతి శ్రీనివాస్, డాక్టర్ చంద్ర రాధికారాణి, డాక్టర్ రాయపాటి మమత పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

లక్ష్మీపురం: కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట మాల్యాద్రి, పుప్పాల సత్యనారాయణ రావుల అంజిబాబు, జి.సురేష్ బాబు,మంగా శ్రీనివాసరావు, కురాకుల రాం ప్రసాద్,కాయల రామారావు, దేగల వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య పాల్గొన్నారు.

రోజువారీ వేతనం ఇవ్వడం లేదని ఫిర్యాదు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రోజువారీ వేతనం ఇవ్వడం లేదని పీజీఆర్‌ఎస్‌లో ఎంహెచ్‌ఓ రవిబాబుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని వాపోయారు.

'అవగాహన'లో నవ్వుల దినోత్సవం

లక్ష్మీపురం: కామెడీ పుస్తకాలు చదివితే, హాస్య సినిమాలు, సన్నివేశాలు చూస్తే ప్రశాంతమైన, ఆనందమయమైన మానసిక స్థితి ఏర్పడుతుందని, హాస్యం యాంటీబయోటిక్ గా పని చేస్తుందని జన విజ్ఞాన వేదిక నాయకులు సిహెచ్.చలమారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నవ్వండి- నవ్వించండి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హాస్యం పది మందిని ఒక చోటికి చేరుస్తుందని, వ్యక్తుల మధ్య శాశ్వత అనుబంధాలను పెంపొందిస్తుందని, ఏకాంత భావనను, భయాలను తరిమి కొట్టగలుగుతుందని వివరించారు. అవగాహన సంస్థ హాస్య వల్లరి కో ఆర్డినేటర్ వి.వి.రావ్ మాట్లాడుతూ నవ్వటం ఆరోగ్య లక్షణమని, నవ్వే వారిని చూసి ఆనందించండి నవ్వులను పెంచండి, పంచండి అంటూ అవగాహన సంస్థ ప్రచారం చేయటం మంచి విషయమన్నారు. ముంబైకి చెందిన డాక్టర్ మదన్ కటారియా లాఫర్స్ క్లబ్ ఏర్పాటు చేసి ప్రపంచ నవ్వుల దినోత్సవానికి దారులు చేశారన్నారు. కార్యక్రమంలో హాస్య ప్రియులు ప్రసాద్, బసవ గుప్త, వెంకటేశ్వరరావులు జోక్స్, కామెడీ స్కిట్స్ లతో అందరినీ నవ్వించారు.

ఉద్యోగులకు రక్షణ కల్పించాలి



డాక్టర్ రమణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: వైద్యశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు రక్షణ కల్పించాలని పారా మెడికల్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ వి.రమేష్ బాబు కోరారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను కలిసి ప్రత్యేక చట్టాల ద్వారా ఆసుపత్రిలోని ఉద్యోగులకు భద్ర కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ రోగులకు సహాయకులు కొంత మంది మద్యం తాగి, రికమండేషన్‌ల సాకుతో విధుల్లో ఉన్న ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతూ, దాడులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు భయంతో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపేద రోగులకు సేవలను అందిస్తున్న ఉద్యోగులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకమైన చట్టాల ద్వారా ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించిన, దుర్భాషలాడిన దాడులకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ ఎస్.నాగరాజు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగు నాయక్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె. పాచ్చా, జాయింట్ సెక్రెటరీ బసవ సాంబయ్య, ఆప్తమాలజీ టెక్నీషియన్ జ్యోతి రాజు, డెంటల్ టెక్నీషియన్ శ్రీరామ్ పాల్గొన్నారు.



సంప్రదాయంగా మెరిశారు..


గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో కాలేజ్ డే పురస్కరించుకుని కొద్దిరోజులుగా వైద్య విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నారు ఐదురోజులపాటు క్రీడా పోటీలు జరిగాయి. సోమవారం సాంస్కృతిక పోటీలు ప్రారంభించారు. స్విమ్మింగ్, డ్యాన్స్, ఫ్యాన్సీ డ్రస్సులు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు పోటీలు జరుగనున్నాయి. పలువురు వైద్య విద్యార్థులు తెలుగు సంప్రదాయ వస్త్రధారణతో మురిపించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి సాంస్కృతిక పోటీలు ప్రారంభించారు.

హడావుడిగా ఆర్డర్లు ఇవ్వడం.. తరువాత సరిదిద్దుకోవడం

- ఇది ఇంజినీరింగ్ సెక్షన్‌లో తంతు
- వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఇన్‌చార్జి వార్డు ఎమినిటీ సెక్రటరీలుగా పోస్టింగ్
- మళ్లీ మార్పులు చేర్పులు చేసేందుకు అధికారుల కసరత్తు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నతాధికారుల సంప్రదింపులు లేకుండా హడావుడి సిబ్బందికి బదిలీలకు సంబంధించి ఆర్డర్లు ఇచ్చేస్తారు.. ఆ తరువాత ఒత్తిళ్లు రావడంతో మళ్లీ ఒకరు, ఇద్దరు కోసం వారిని మార్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టడం పరిపాటిగా మారింది.రెండు రోజుల క్రితం 43 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లకు వార్డు ఎమినిటీ సెక్రటరీలుగా పోస్టింగ్ ఇప్పించారు ఇంజినీరింగ్ అధికారులు. దీనిపై సాక్షిలో ఆదివారం వర్క్ ఇన్‌స్పెక్టర్లుకు ఎమినిటీ సెక్రటరీలుగా పోస్టింగ్ అనే కథనం ప్రచురితమైంది. దీనిపై సోమవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు, ఏఈలు, డీఈలు, ఈఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎవరికైన ఇబ్బందులు ఉంటే ఎస్ఈతో చర్చించి మార్పించుకోవాలని సూచించారు. అయితే వర్క్ ఇన్‌స్పెక్టర్లు కొంత మంది సెక్రటరీలుగా వెళ్లేందుకు సుముఖంగా లేరు. మరి కొంత మంది నాన్ టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు సచివాలయం పరిధిలో సర్వే డ్యూటీలు చేయలేమని మొత్తుకుంటున్నారు. మరి కొంత మంది తమకు నచ్చిన రాలేదని బేరసారాలు మొదలు పెట్టారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు అనుకున్న స్థానం కల్పించేందుకు ఓ ఏఈ, కంకణం కట్టుకుని డీఈ, ఈఈ, ఎస్ఈ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొంత మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు ముడుపులు ఇస్తే నచ్చిన స్థానంలో పోస్టింగ్ ఇస్తారా అంటూ బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఒకరు, ఇద్దరి కోసం కేటాయించిన స్థానాలు మార్చాలని చూస్తే ఊరుకోమని.. మారిస్తే అందరికి మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఘనంగా కారల్ మార్క్స్ జయంతి



కారల్ మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

లక్ష్మీపురం: పీడిత వర్గాలకు మార్గదర్శి మార్క్సిజమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో ప్రపంచ మేధావి, కార్మికవర్గ సిద్ధాంత సృష్టికర్త కారల్ మార్క్స్ జయంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మార్క్స్ కంటే ముందు సమాజం మారుతుందని చాలా మంది తత్వవేత్తలు చెప్పారన్నారు. కాని ఏ విధంగా మారుతుందో గతితార్కిక పద్ధతిలో చెప్పిన తత్వవేత్త కారల్ మార్క్స్ అన్నారు. సమాజంలో ప్రజలు దోపిడీకి గురైనంత కాలం మార్క్సిజం అజేయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈమని అప్పారావు, కె.నళినికాంత్, బి.ముత్యాలరావు, వై.కృష్ణకాంత్, ఎ.వి.వర్మ, వి.నారాయణ పాల్గొన్నారు.

మహనీయుడు కారల్ మార్క్స్

లక్ష్మీపురం: సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్ లో కారల్ మార్క్స్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొని మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు (చిన్న) అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, చల్లా మరియా దాసు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

లక్ష్మీపురం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరి- కృష్ణ కెనాల్ రైల్వే స్టేషన్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 35 వయస్సు కలిగిన యువకుడు రైలు కింద పడి మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి 8328018787, పోలీస్ స్టేషన్ 0863-222073 నంబర్‌లకు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

మహిళకు కారుణ్య నియామక ఉత్తర్వులు



యువతికి ఉత్తర్వులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించి మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఇచ్చే కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఓ మహిళకు అందజేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఓ మహిళకు వైద్య ఆరోగ్య శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల గాత్ర కచేరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం మాస్టర్స్ మ్యూజిక్ అకాడమీ తొమ్మిదో వార్షికోత్సవం నిర్వహించారు. పాలక మండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహా కార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్నారులు గాత్రం, కీబోర్డు, గిటార్, వయోలిన్ నిర్వహించారు. సభికులను అలరించాయి. కార్యక్రమంలో రాజేంద్ర, అజేంద్ర పాల్గొన్నారు.